# బ్రహ్మచారి

•

బి. ఆర్. రావు.

•

'నేను బ్రహ్మచర్యవ్రతాన్ని అవలంబిస్తాను యివాళనుంచి'...

అని యెవడైనా పట్టుపట్టి మనసునిలకడగా వుంచుకున్నాడంటే...

అదిగో వాడికే యెక్కడైనా 'పడకటింటి ముచ్చట్ల పుస్తకమో-కామసూత్రాల గ్రంధమో యేదో కనిపించితీరుతుంది'...

లేకపోతే...

ఎవరో ఒక స్త్రీ దిగంబరిఅయి స్నానం చేసుకుంటున్నపుడు దృశ్యం గభీలుమని వాడికే కనిపిస్తుంది...

...కళ్లు జిగేల్మంటాయి...

'శివా'మని తెల్లారి పరుపుమీదినుండి లేస్తాడోలేదో యెదూరుగుండా 'గోపికావస్త్రాపహరణం' ఫొటో ప్రత్యక్షమౌతుంది

న్యూసు పేపరు తెరుస్తాడు. ఏమీ పాలుపోక...

ఛీ!-ఛీ!! ఫ్రెంచి ఆర్టుఫొటోస్... లాహోర్-అనో, లేకపోతే-వీర్యబంద్! ధనాల్మని కనిపిస్తుంది.

మరోపేజీ తిప్పేసరికి

...రంగురంగుల రబ్బరుట్యూబులు-అన్న వాక్యమైనా కళ్ళబడితీరుతుంది.

పోనీ-వెధవగొడవ-రామా-కృష్ణా... అనుకుందామని యేమహాభారతమో 'ఓపెన్' చేసేసరికి-సరీగ్గా-'కీచకుడు ద్రౌపదిని మోహించుట'-యేదో యిలాటి శీర్షికే దృగ్గోచరమౌతుంది.

నిశ్చలంగా ఓచోట కూర్చున్నాడంటే-

ఏజట్కావాడో-'అబ్బ దానిసోకో...: మీదజాకెట్టో'-అనియేదో పచ్చిశృంగారపు పాట పాడుకుంటుంటే-అదే మనవాడి చెవిలో దూరుతుంది.

'ఛీ! పాడుజన్మ'! అనేసి యేమీ తోచక యేచెట్టువేపో...యింటివేపో తదేకధ్యానంతో నిరీక్షిస్తున్నాడంటే...

ఆచెట్టుమీదే రెండుపిట్టలువాల్తాయి. ఆరెండింటి రొమాంటిక్ సీను మనవాడికళ్ళకే కనిపిస్తుంది...

ఒళ్ళుఝల్లుమంటుంది బ్రహ్మచారికి.

ఒక్కనిట్టూర్పు విడుస్తాడు—

అక్కడేవుంది బ్రహ్మచారి ఆచారమంతాను.

ఇలాటి దృశ్యాలకు తట్టుకోని చలించకుండా దిట్టపడ్డాడా-సరేసరి-లేకపోతేమాత్రం-—ప్రమాదం-వ్రతభంగం.

అలాగే—

'ఇవాళనుంచీ సిగరెట్లుమాని తీరుతాను' అని భీష్మించినవాడికి ఆరోజునుంచీ పర్సులో పైసాలు పలపలలాడటమో-లేదా-ఆఫరింగ్స(offerings) లావయిపోవటమో తటస్థిస్తుంది. అందులో యివీ-అవీకాకుండా State-express సిగరెట్లే ఆఫర్ చేస్తారు మిత్రులు.

ప్రకృతిలో యిది సహజం. మనవేపు ప్రభంజనాలే వీస్తాయి.

కొంచెం సూక్ష్మంగా పరిశీలించిన ప్రతివ్యక్తికీ మన దైనిక జీవితంలోనే కనిపించే సంఘటనలివి—నిజమేనా?